

ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

నాగోల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించండి

మన్సూరాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీ ల్లో చేపట్టదలచిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు పలు కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి సోమవారం శామీర్‌పేట లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాక్‌టౌన్‌కాలనీ, సర్వే నంబర్.58, బాలాజీనగర్‌కాలనీ, చాణక్యపురికాలనీ, ఆప్కోకాలనీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, నాగోల్, మన్సూరా బా ద్ శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందుకు సానుకూ లంగా స్పందించిన ఈటల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. అనంతరం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను సైతం కలిసి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, ఆయా కాలనీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన రోషన్‌దౌలా కాలనీవాసులు

చంపాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా కాలనీవాసులు సోమవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్‌తో కలిసి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాలనీలో 40సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నట్లు, కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు వారు ఎంపీకి వివరించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ లేకపోవడంతో వైశాలినగర్ జలమండలి నుంచి రెండు రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకర్ పంపిస్తున్నట్లు వారు తెలిపారు. తమకు నీరు సరిపోవడం లేదని, మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇప్పించాలని వారు ఎంపీని కోరారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించనున్నట్లు ఎంపీ వారికి హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరి, పెద్దిరెడ్డి, శిరీష, భాస్కర్‌రెడ్డి, జె.రవి, మహిపాల్‌రెడ్డి, ఆకాష్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం

చంపాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చైర్మన్‌గా జి.శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షులుగా వి.సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.హరివర్ధన్, కోశాధికారిగా ఎస్.అల్వాల్‌రెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా వి.ధర్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.వెంకట్‌రెడ్డి, టి.నిర్మల, సంయుక్త కార్యదర్శులుగా పి.మాధవరెడ్డి, కె.నాగరాజు, కె.అరుణ ఎన్నికైనారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో నీటి కష్టాలు పరిష్కరించండి: కార్పొరేటర్



సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో తాగు నీటి సరఫరా సమస్యలు, మురుగునీటి కష్టాలను పరిష్కరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి జీఎం బలరాంకు, ఏఈ స్రవంతిరెడ్డిలకు విన్నవించారు. సోమవారం ఆయన జలమండలి కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. కొత్తపేటలోని మారుతీనగర్, మోహన్‌నగర్, కామినేనిచౌరస్తా సమీపంలో గల శ్రీశంకర్‌కాలనీ, భరత్‌నగర్ -2, శివగంగకాలనీ తదితర ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. పాత డ్రైనేజీ పైప్‌లైన్లతో పాటు, ఏళ్ల క్రితం నిర్మించిన మ్యాన్‌హోళ్ల సమస్యలు తరచూ తలెత్తుతున్నాయని తెలిపారు. ఆ ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించి నూతన పైప్‌లైన్లు వేయాలని, తగిన మ్యాన్‌హోళ్లు నిర్మించాలని కోరారు. పైప్ లైన్ పనులు ముగిసిన తర్వాత వెంటనే ప్యాచ్‌వర్క్ చేపట్టాలని విన్నవించారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

సైదాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్యసింధు ఆశ్రమంలో పది రోజుల పాటు నిర్వహించిన మన వారసత్వ సంపద వేసవి సంస్కార శిబిరం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమారోహ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ నేతలు రమేష్‌రాజు, రావినూతల శశిధర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ తరగతుల్లో విద్యార్థులు నేర్చుకున్న విషయాలు, శ్లోకాలు, పాటలు, పద్యాలు, భగవద్గీత శ్లోకాలను వినిపించారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వర్‌రావు, సభ్యులు రవీంద్రశర్మ, నారాయణరెడ్డి, పాండుచారి, చంద్రశేఖర్‌రావు, హరికిషన్‌శర్మ పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, అశోకచక్రవర్తి తదితరులు

'ఊహల ఊయల' పుస్తకావిష్కరణ

సరూర్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ కథా రచయిత ఐ.ఎ.నరసింహం రచించిన 'ఊహల ఊయల'(ట్యాగ్‌లైన్: ఇందులో కథలన్నీ ఆణిముత్యాలే) అనే పుస్తకాన్ని ఆదివారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లోని టీఎస్‌ఆర్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఐ.నాగేశ్వరరావు, కాలనీకి చెందిన కథా రచయిత నీలకంఠం అశోక్‌చక్రవర్తి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊహల ఊయల అనే పుస్తకంలో మనిషి జీవన పయనంలో సాగే నాలుగు దశలను కథల రూపంలో చక్కగా వివరించారని అన్నారు. బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం దశల్లో కలిపి మొత్తం 59 కథలుగా కూర్చిన తీరు అద్భుతమని వారు పేర్కొన్నారు. ట్యాగ్‌లైన్‌లో పేర్కొన్నట్టు నిజంగానే ఇందులోని కథలన్నీ ఆణిముత్యాలే అని, ప్రతి ఒక్కరికి నచ్చేటట్టు సదరు కథలు ఉన్నాయని వారన్నారు. అనంతరం రచయిత నరసింహంను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు అమృత, శేఖర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్‌గుప్తా జన్మదిన వేడుకలు

- తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం యూఎస్‌జీ(ఉప్పల శ్రీనివాస్‌గుప్తా) టీం, ఐవీఎఫ్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయగా వారికి ఉప్పల ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అవసరం మేరకే రసాయనాలను వాడండి

- ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎం. యాకాద్రి

హయత్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకే రసాయనాలను వాడి పంటలను పండించుకోవాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎం. యాకాద్రి అన్నారు. వానాకాలంలో అన్నదాతలను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విస్తరణ సంచాలకులు ఎం. యాకాద్రి మాట్లాడుతూ అవసరం లేకున్నా మందులు వాడడం వల్ల నేల సారవంతాన్ని కోల్పోతుందన్నారు. అందువల్ల రైతులంతా అవసరం మేరకే రసాయన మందులు వాడాలని సూచించారు. తక్కువ యూరియా వాడి.. సాగు ఖర్చును తగ్గించుకోవాలని కోరారు. రసాయన మందుల కోసం అయ్యే ఖర్చుల రసీదులను భద్ర పరచాలన్నారు. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందడానికి వీలు ఉంటుందన్నారు. సాగునీటిని ఆదాచేసి భావి తరలాకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు అలాంటి పంటలను ఎంచుకోవాలని కోరారు. రైతులు పంటల మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందేందుకు చేపట్టిన రైతు నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకాన్ని ఆధార్ కార్డుతో లింకు చేసుకోవాలన్నారు. రైతు తన ఫోన్ నంబర్‌ను కచ్చితంగా అందులో ఉంచాలన్నారు. ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారి వద్ద రైతుల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, విశ్వవిద్యాలయం డైరెక్టర్ జి. శ్రీనివాస్, శాస్త్రవేత్తలు రజనికాంత్ అరుణశ్రీ, అబ్దు రఘు, నాయకులు కౌశిక ఐలయ్య, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, బల్‌దేవ్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు. లాపూర్‌మెట్ మండల వ్యవసాయ అధికారి పల్లవి,



శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎం. యాకాద్రి



సబితారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ ఇతర నేతలు



సబితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు

సబితకు పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

- వీఎంహోంలో బాలలతో కలిసి జన్మదిన వేడుకలు
- జిల్లెలగూడ బాలాజీ టెంపుల్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సరూర్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పుట్టిన రోజు వేడుకలను సోమవారం బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆమె నివాసానికి తరలివెళ్లి, కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడి నుంచి వేద పండితులను ఆమె ఇంటికి తీసుకెళ్లి ఆశీర్వచనం అందజేయించారు. గులాబీ దండు రాకతో సబితమ్మ నివాసం వద్ద సందడి నెలకొంది. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సబితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఆమెను ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంతో తన అనుబంధం కలకాలం కొనసాగుతుందని, తాను ఎవరినీ విస్మరించబోనని పేర్కొన్నారు. ప్రజలే తన బలం, బలగం అని ఆమె వ్యాఖ్యానించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్ : బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలో ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. సరూర్‌నగర్ వీఎంహోంలో సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీఎంహోంలో అనాథ బాలల నడుమ ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలలతో కలిసి భారీ కేక్ కట్ చేశారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అల్మాస్‌గూడ రామిడి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, ఉద్యమకారులు రామాచారి, గొడుగు శ్రీనివాస్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, యూత్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌గుప్తా, కపిల్, మహేందర్‌రెడ్డి, కుమార్, విజయ్, మురళీధర్‌రెడ్డి, అభిలాష్, శ్రీనివాస్ యాదవ్, దీపు, నవీన్ పాల్గొన్నారు.



వీఎంహోంలో బాలలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మామిడి పండ్లను రసాయనాలతో మగ్గిస్తే కఠిన చర్యలు

- మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు

ఓల్డ్‌మలక్‌పేట, మే 5(ఆంధ్రజ్యోతి): రసాయనాలతో మామిడి పండ్లను మగ్గపెట్టి విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలుంటాయని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు పండ్ల వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలిసి ఆయన జాంబాగ్ మార్కెట్‌లో మామిడి పండ్ల షాపుల్లో రసాయనాల తనిఖీలు చేశారు. మామిడి పండ్లను పరిశీలించి రసాయనాలతో ఉన్న మామిడి పండ్లను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు తరలించారు. అనంతరం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని మామిడి సీజన్ కావడంతో వ్యాపారులు పండ్లలో ఇతాలియన్ కెమికల్స్ పెట్టి సహజ పద్ధతిలో కాకుండా రసాయనాలతో మగ్గపెడుతున్నారని తద్వారా ఈ పండ్లను తిన్నవారికి ఆరోగ్యం పాడవుతుందన్నారు. తనిఖీల్లో మూడు షాపుల నుంచి దాదాపు పదిహేను పెట్టెల మామిడి పండ్లను సీజ్‌చేసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రిపోర్టు వచ్చిన అనంతరం రసాయనాలు కలిపినట్లు తేలితే వ్యాపారి లైసెన్సు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్ వన్ సెక్రెటరీ చిలక నర్సింహారెడ్డి, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సౌమ్య, రాజేశ్వరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మామిడి పండ్లను పరిశీలిస్తున్న దృశ్యం

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిది : చైర్‌పర్సన్

సైదాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలలకు కూడా హక్కులు ఉంటాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, పరిశీలన గృహం(జువెనైల్ హోమ్‌లు), డీ-అడిక్షన్ సెంటర్‌ను చైర్‌పర్సన్‌తో కలిసి కమిషన్ సభ్యులు మరిపల్లి చందన, అపర్ణ, వందనగౌడ్, వచన్‌కుమార్, ప్రేమలత, సరితలతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పరిశీలన గృహంలో వివిధ కేసుల విచారణలో ఉన్న బాలలు, బాలుర గృహంలో ఉన్న వీధి బాలలు, బాలకార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హోంల నిర్వహణ తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చారువాక్, అసిస్టెంట్ చీఫ్ ప్రొబేషన్ సూపరింటెండెంట్(ఏసీపీఎస్) నవీన్, హోం సూపరింటెండెంట్లు సంఘమేశ్వర్, అఫ్జల్‌షాఅలీ, అధికారులు గోపీకుమార్, జ్వాల, ఉమర్, పాల్సన్ పాల్గొన్నారు.



హోంలో భోజనశాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, కమిషన్ సభ్యులు

జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట హాజరైన కార్పొరేటర్

చంపాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ సోమవారం హాజరయ్యారు. ఇటీవల ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సుజాతానాయక్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన సంగతి విధితమే. జాతీయ ఎస్టీ కమిషన్ సుజాతానాయక్‌కు నోటీసులు ఇవ్వడంతో కార్పొరేటర్ కమిషన్ ముందు హాజరై తనను ఎమ్మెల్యే అవమానిస్తూ మాట్లాడిన తీరును ఆమె వివరించారు. ఎమ్మెల్యేని వెంటనే అరెస్టు చేయాలని, తనకు తగిన న్యాయం చేయాలని కార్పొరేటర్ కమిషన్‌ను కోరారు. అనంతరం గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్‌చౌహాన్ కార్పొరేటర్‌తో కలిసి మాట్లాడుతూ కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేని వెంటనే అరెస్టు చేయాలని, కార్పొరేటర్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినా అతడిని నేటికీ పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు వెంకటేష్‌చౌహాన్ అన్నారు. ఎమ్మెల్యేను స్పీకర్ అనర్హుడిగా ప్రకటించాలని, బీఆర్‌ఎస్ నుంచి సుధీర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

రేస్‌టువిన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- నటి రెజీనా కసాండ్రా
- స్మార్ట్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన నటి

ఓల్డ్‌మలక్‌పేట, మే 5(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలోని రేస్‌టువిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవాకార్యక్రమాలు అభినందనీయమని నటి రెజీనా కసాండ్రా అన్నారు. ఓల్డ్‌మలక్‌పేటలోని విజయనగర్‌కాలనీలోని రేస్‌టువిన్ ఫౌండేషన్ వారు దత్తత తీసుకొని అధునాతన హంగులతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లల భావోద్వేగానికి అణుగుణంగా వారి మేధో అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం అంగన్‌వాడీ కేంద్రంలో కల్పించడం వల్ల పిల్లల్లో చిన్నతనం నుంచే పాజిటీవ్ ప్రేరణ కలుగుతుందన్నారు. పసి మనస్సులకు అర్థమయ్యే విధంగా ఇంట్రాక్ట్ లెర్నింగ్ విధానంలో ఎల్‌ఈడీ స్ర్కీన్‌లతో విద్యాబోధన చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని దత్తత తీసుకొని అధునాతనంగా తీర్చిదిద్దిన రేస్‌టువిన్ ఫౌండేషన్ వారిని అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వై గోపీరావు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఇది ఒక ముఖ్యమైన అడుగని అంగన్‌వాడీ కేంద్రాన్ని దత్తత తీసుకొని చిన్నారులకు పసి వయస్సు నుంచే అర్థమయ్యే రీతిలో టెక్నాలజీ విద్యావిధానాలతో బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీయుద్దీన్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నటి రెజీనా కసాండ్రా

20న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

మన్సూరాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారి వ్యవస్థకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, లేబర్ కోడ్ల రద్దుకై ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగనున్న సమ్మెను ప్రతి కార్మికుడి విధిగా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని కార్మికులను కలిసి కోరడంతో పాటు కార్మిక సమ్మెకు సహకరించాలని పలు ఇండస్ట్రీలలోని మేనేజ్మెంట్‌ను కలిసి విన్నవించారు. చింతలపల్లి కృష్ణయ్య, సత్యనారాయణ, నరహరి, పొట్లచెరువు అచ్చాలు, రాసూరి భిక్షపతి, శ్రీనివాస్, సీహెచ్‌కేరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

హయత్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న సమ్మెలో కార్మికులందరు పాల్గొంటారని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి కార్మిక నాయకుడు డి. కిషన్ సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. దీని వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, మాల్యాద్రి, మాధవరెడ్డి, దయానంద్, సరిత, నాగమణి పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిన్నరథోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి సురేఖ దంపతులు

ముగిసిన అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్, మే 5(ఆంధ్రజ్యోతి): వారం రోజుల పాటు వైభవంగా సాగిన వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో చక్రతీర్థం నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ చిన్న రథోత్సవం పురవీధుల గుండా సాగింది. టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు ప్రత్యేకపూజలతో పాటు చిన్న రథోత్సవంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా అలంకరణ, రాజభోగ నివేదన, శాత్తుముఱై, కుంభ ప్రోక్షణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, గౌరిశెట్టి అరుణ్, చిలుక ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, తమ్మన శ్రీధర్, ఉమాపతిరావు, మాలే శ్రీనివాస్, గ్రంధి రమేష్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, రామ్‌కిషన్ పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయంలో విష్ణునాథ్ పూజలు

చంపాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని ధ్యానాంజనేయస్వామిని సోమవారం అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి, తెలంగాణ పార్టీ ఇన్‌చార్జి పీసీ విష్ణునాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన పండితులు, అర్చకులు విష్ణునాథ్‌కు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూదిని మహేందర్, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, బుచ్చి నారాయణ పాల్గొన్నారు.

7న వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

చంపాపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు, ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్, సినీ యాక్టర్ పసునూరి శ్రీనివాస్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌లో అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 7న ఉదయం 8గంటలకు గణపతిపూజ, 9:30గంటలకు వాసవీ మాతకు ప్రత్యేక అభిషేకం, 11గంటలకు మహిళలచే కుంకుమార్చన, 12:30గంటలకు కన్నెపూజ, అఖండ హారతి, 1గంటకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారి శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు, జిల్లాలోని ఆయా విభాగాల కమిటీలు, జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కుంకుమార్చనలో పాల్గొనే మహిళలు ముందుగా 51 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, శోభాయాత్ర, కుంకుమార్చనలో పాల్గొన్న వారికి లక్కీడీప్ ద్వారా ప్రైజ్‌లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేయండి



మండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రైల్వేబోర్డు సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని రోజులుగా వనస్థలిపురం డివిజన్‌లో పలు కాలనీలవాసులు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ రవీందర్‌గౌడ్, నాయకులు విజయ్‌కుమార్, కాలనీవాసులు సత్తయ్య, శంకర్‌గౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.